సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ మొదలు కానున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.


- 8లో



గురుకుల ప్రవేశాలకు..

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

- 8లో



విద్యుత్ కాంతులతో మహాలక్ష్మి తల్లి ఆలయ స్వాగత ద్వారం

నయనానందకరం

కమ్మసిగడాం జాతర కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగింది. రెండో రోజు శనివారం జాతరకు జనం పోటెత్తారు. ఉదయం నుంచే మహాలక్ష్మి తల్లి అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారంతో జాతర ముగియనుంది

- రణస్థలం



కమ్మసిగడాం జాతరలో విద్యుత్ కాంతుల నడుమ అలరిస్తున్న వినోద కార్యక్రమాలు

న్యూస్‌రీల్

వత్సవలస జాతర ప్రారంభం



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

గార: వత్సవలస రాజమ్మ తల్లి జాతర శనివారం ప్రారంభమైంది. రాత్రి ఇక్కడే జాగరణ చేసిన భక్తులు ఆదివారం ఉదయం ప్రధాన పీఠాలు వద్ద పూజలు జరుపుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకుంటారు. తొలి వారం మైలపల్లి శ్రీనివాసదాసుడు ఇంటి వద్ద సంబరం జరగనుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. పోలీసు బందోబస్తులో భాగంగా 90 మంది విధుల్లో పాల్గొంటున్నారని ఎస్‌ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. శనివారం రాత్రి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నామని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. .

అనారోగ్యంతో మహిళా భక్తురాలు మృతి



మృతి చెందిన పాత్రుని ఒడ్డమ్మ

గార: సారవకోట మండలం అంగూరుకు చెందిన పాత్రుని ఒడ్డమ్మ (62) శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులతో కలసి శాలిహుండం గిరి యాత్రకు వచ్చారు. ముందుగా వంశధార నది వద్దకు చేరుకుని పవిత్ర స్నానం చేశారు. స్నానాల అనంతరం ఒడ్డుకు వచ్చిన తర్వాత మృతురాలు ఒడ్డమ్మ తీవ్ర ఆయాసానికి గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు సపర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదు. కొద్ది సేపటికే మృతి చెందారని, ఉదయం నుంచి ఉపవాసం, అనారోగ్యం కారణంగా మరణించిందని కుమారుడు కృష్ణ తెలిపాడు.

చెరువు గట్టునూ వదలని మట్టి మాఫియా

వజ్రపుకొత్తూరు: మండలంలోని సీతాపురానికి చెందిన ఎర్ర చెరువు గట్టు మట్టి మాఫియా వశమవుతోంది. రెండు రోజులుగా జేసీబీ యంత్రాలు, ట్రాక్టర్ పెట్టి తవ్వుకుపోతున్నారు. ట్రాక్టర్ లోడు రూ.500 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. గ్రామానికి చెందిన చెరువు ఆయకట్టు రైతులు టి.బాలకృష్ణ, రాజారావు, మరో 10 మంది అడ్డుకున్నప్పటికీ మట్టి మాఫియా నుంచి బెదిరింపులు రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గట్టు పటిష్టానికి దాదాపు రూ.80 లక్షలు వరకు ఉపాధి నిధులు ఖర్చు చేశారు.



జేసీబీ యంత్రంతో తవ్వేస్తున్న ఎర్ర చెరువు గట్టు

బీఆర్ఆర్ వంశధార ఎస్ఈగా పీవీ తిరుపతిరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్ట్ సర్కిల్ ఎస్ఈగా అదనపు బాధ్యతలను పీవీ తిరుపతిరావుకు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం టీటీపీఆర్ సర్కిల్ విజయనగరం డీఎస్ఈగా పనిచేస్తున్నారు. ఈయన మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు.

యోగా విశ్వవ్యాప్తం కావాలని..

కాశీబుగ్గ: భారతీయ యోగా, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత విశ్వవ్యాప్తం కావాలనే సంకల్పంతో భారత దేశమంతటా స్కేటింగ్ యాత్ర చేస్తున్నారు వారణాసికి చెందిన సోనీ చౌరాసియా. 10550 కిలోమీటర్లు రోడ్డుపై స్కేటింగ్ చేస్తూ ప్రయాణిస్తున్నారు. రోజుకు 100 నుంచి 120 కిలోమీటర్లు ప్రయాణిస్తున్న ఆమె శనివారం నాటికి పలాస చేరుకున్నారు. ఈ జనవరి 20వ తేదీన ప్రారంభమైన యాత్ర మే 12న పూర్తవుతుందని ఆమె తెలిపారు. గతంలో ఈమె శ్రీనగర్ లాల్‌చౌక్ నుంచి కన్యాకుమారి వివేకానంద రాక్ వరకూ స్కేటింగ్ చేసి ఉన్నారు. తన భర్త సచిన్, గురువు రాజేష్ డోగ్రా ఆశీస్సులతో ప్రయాణిస్తున్నానని అక్కడక్కడా ప్రజలు ఆప్యాయంగా పలుకరిస్తున్నారని అన్నారు.



స్కేటింగ్ చేస్తూ పలాసకు చేరుకున్న సోనీ

- టీడీపీ నేత గుప్పెట్లో ట్రిపుల్ ఐటీ అవుట్‌లెట్స్
- చౌదరి బాబ్జీ కుటుంబీకులకు ఫుడ్‌కోర్టు తదితర షాపులు కట్టబెట్టిన వైనం
- నోటిఫికేషన్ లేకుండా, దరఖాస్తులు ఆహ్వానించకుండా వ్యవహారం నడిపిన అధికారులు
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల సిఫార్సులే కారణమని ఆరోపణలు



ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ



ట్రిపుల్ ఐటీ ఆదాయం తమ్ముళ్లకే అర్పణం



చౌదరి బాబ్జీ కుటుంబీకులు, అనుచరులైన వారి పేర్లను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు సిఫార్సు చేస్తూ డీఆర్‌డీఏ పీడీ రాసిన లేఖ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలోనూ రాజకీయం జోక్యం ప్రవేశించింది. అక్కడుండే క్యాంటీన్, ఫ్రూట్ జ్యూస్, సెలూన్, జిరాక్స్ వంటి అవుట్‌లెట్లను నామినేటెడ్ పద్ధతిలో కొట్టేశారు. దీంతో యూనివర్సిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడింది. స్వయం సహాయక సంఘాల ముసుగులో టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జీ కుటుంబీకులకు అధికారులు కట్టబెట్టారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సిఫార్సులతో చౌదరి బాబ్జీకి ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేలా మేలు చేశారని, స్వాక్షాత్తు తోటి టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల చేతుల్లోకి అవుట్‌లెట్స్ వెళితే అక్కడి పిల్లలకు ఎలాంటి క్వాలిటీ ఫుడ్ అందుతుందో, ధరలు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

ఆదాయానికి గండి..

ట్రిపుల్ ఐటీల్లో క్యాంటీన్లు ఇతరత్రా నిర్వహణ బాధ్యతలను గత ప్రభుత్వం వరకు టెండర్ల ద్వారా నిర్వాహకులను పిలిచేవారు. ఎవరైతే అత్యధికంగా కోట్ చేసేవారో వారికే అక్కడున్న అవుట్‌లెట్స్ కాంట్రాక్ట్‌ను అప్పగించేవారు. ఫలితంగా ప్రతి నెలా రూ.2,66,680 ఆదాయం వచ్చేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రిపుల్ ఐటీల ఆదాయానికి కన్నం పెట్టారు. తమ పార్టీ నాయకులకు ఉపాధి కల్పించడానికి పాత విధానాన్ని రద్దు చేసి, రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలు అన్నింటిలోనూ అవుట్‌లెట్స్‌ను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని, వాటి ముసుగులో టీడీపీ నాయకులే వాటిని నడపాలని వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీనికి త్రీమెన్ కమిటీ సిఫార్సులని కలరింగ్ ఇచ్చారు. తొలుత మండల మహిళా సంక్షేమ సొసైటీలు, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్, వాలంటరీ ఆర్గనైజేషన్‌లకు ఇవ్వాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)తో నియమితులైన త్రీమెన్ కమిటీ సిఫార్సు చేసింది. ఇలా అయితే బయట వ్యక్తులు కూడా వచ్చేస్తారని అభిప్రాయపడి, అధికార పార్టీ నాయకులకు మేలు జరుగుతుందో లేదోనని మెప్మా లేదా మండల సమాఖ్య ఆర్గనైజేషన్స్‌కు కూడా ఇవ్వవచ్చని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడా మండల సమాఖ్య ఆర్గనైజేషన్ ముసుగులో స్వయం సహాయక సంఘాల్లో, ముఖ్యంగా వాటిలో ఉన్న ముఖ్య నాయకుల కుటుంబీకులకు కట్టబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఇదే రకంగా జరిగింది. ఇందులో ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ మరో ఎత్తుగా నిలిచింది.

స్వయం సహాయక సంఘాలకు ఇచ్చాం

ట్రిపుల్ ఐటీ అవుట్‌లెట్స్‌ను స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ఇవ్వాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ) నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఎంపురానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు నేరుగా ఇచ్చాం. దీనికోసం నోటిఫికేషన్ ఇచ్చి, దరఖాస్తులు ఆహ్వానించాలని మాకెలాంటి సమాచారం లేదు.

– కిరణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

నిబంధనలు బేఖాతరు...

- సాధారణంగా ఏదైనా ఇవ్వాలంటే వాటికి అధికారిక నోటిఫికేషన్ ఇవ్వాలి.
- ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలి.
- అందులో ఎవరెంత కోట్ చేశారో ఎవరు పని తీరు ఎలా ఉందో అంచనా వేసి, వారిని కాంట్రాక్టర్‌గా ఆహ్వానించాలి.
- కానీ ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో అది జరగలేదు.
- అవుట్ లెట్స్ నిర్వహణ కోసం నోటిఫికేషన్ ఇవ్వలేదు.
- దరఖాస్తులను ఆహ్వానించలేదు. ఏకంగా నామినేటెడ్‌గా టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జీ కుటుంబీకులకు కట్టబెట్టేశారు.
- వీరికివ్వాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు సిఫార్సు చేసినట్టు స్వాక్షాత్తు తోటి టీడీపీ వాళ్లే నొక్కి చెబుతున్నారు.

ఏదీ పారదర్శకత..?

పేద మహిళలకు అవుట్‌లెట్లు ఇస్తే బాగుండేది. ట్రిపుల్ ఐటీ అవుట్ లెట్స్ కోసం స్వయం సహాయక సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలి. ఆ మేరకు నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇక్కడదేమీ జరగలేదు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సిఫార్సు చేశారని.. చౌదరి బాబ్జీ కుటుంబీకులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం. కనీసం ఊరిలో ఉన్న పేద మహిళలకు ఇస్తే వారికి ఉపాధి దొరికేది. ఇదేంటని అధికారులను అడిగితే మంత్రి అచ్చెన్నాయుడు దగ్గరికి వెళ్లి మాట్లాడుకోవాలని చెబుతున్నారు.

– సంధ్యా గజపతిరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎచ్చెర్ల మండలం

కట్టబెట్టారిలా...

ఎచ్చెర్ల మండలంలోనే వందలాది స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఎస్ఎంపురంలో కూడా అనేక స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో దివ్యాంగులు, పేదవాళ్లు ఉన్న సంఘాలు సైతం ఉన్నాయి. వీరెవరూ దరఖాస్తు చేసుకునే వీలు లేకుండా చౌదరి బాబ్జీ కుటుంబీకులకు నేరుగా ఇచ్చేశారు. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో రెండు ఫుడ్ కోర్టులు, మూడు స్టేషనరీ అండ్ జిరాక్స్ షాపులు, మూడు ఫ్రూట్ జ్యూస్ షాపులు, రెండు సెలూన్ షాపులు, ఒక టీ షాపు ఉంది.

- వీటిలో ఫుడ్‌కోర్టులను చౌదరి బాబ్జీ కుమార్తె బి.చైతన్యకు నామినేటెడ్‌గా ఇచ్చారు. ఈమె శ్రీసాయిరాం స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా ఉన్నట్టుగా చూపించారు.
- ఫ్రూట్ జ్యూస్ షాపులను చౌదరి బాబ్జీ అనుచరుడు, మాజీ ఎంపీటీసీ నర్సింగరావు భార్య దుర్గ(రాధాకృష్ణ స్వయం సహాయక సంఘం)కు ఇవ్వగా, స్టేషనరీ అండ్ జిరాక్స్ షాపులను ప్రస్తుతం ఎస్ఎంపురం ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ పొన్నాడ చలపతిరావు భార్య వరహాలు(సింధు స్వయం సహాయక సంఘం)కు ఇచ్చారు.
- ఇంకా దారుణమేంటంటే సెలూన్ షాపును ఆ సామాజిక వర్గానికి చెందిన వారికి కాకుండా కాళింగ సామాజిక వర్గానికి చెందిన చౌదరి బాబ్జీ మేనల్లుడు కింతలి నాగేశ్వరావు భార్య ఉషకు కట్టబెట్టారు. ఈ షాపులన్నీ స్క్వేర్‌ఫీట్‌కు రూ.5 చొప్పున అద్దె చొప్పున చెల్లించేలా ఒప్పందం కూడా జరిగిపోయింది.

ఈ లెక్కనైతే ట్రిపుల్ ఐటీకి నెలకి రూ.18వేలు మించి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. అంటే గతం కంటే ఆదాయం భారీగా తగ్గిపోయింది. దాదాపు ప్రతి నెలా రూ.2లక్షల 48 వేల మేర ట్రిపుల్ ఐటీ ఆదాయాన్ని కోల్పోయినట్టు అవుతోంది. అంతేకాకుండా ఇవే షాపులను చౌదరి బాబ్జీ మరికొంత మందికి లీజుకిచ్చి రూ.లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారని టీడీపీ నాయకులే చెబుతున్నారు. అసలు చౌదరి బాబ్జీ కుమార్తె స్వయం సహాయక సంఘంలో సభ్యురాలేమిటని ప్రశ్నిస్తున్నారు.

బాలుడా.. గోపాలుడా.. లోకాల పాలుడా





శాలిహుండం కొండపైన భక్తులు (ఇన్‌సెట్లో) కాళీయ మర్ధన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేక సేవ

గార: భీష్మ ఏకాదశి పర్వదినాన శాలిహుండం శ్వేతగిరి భక్తులతో జనవంశధారను తలపించింది. కాళీయమర్ధన వేణుగోపాలస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్వేతగిరి కిటకిటలాడింది. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు, లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను రెండు పల్లకీల్లో సుమారు రెండు కిలోమీటర్లు దూరంలోని వంశధార నదికి తీసుకువచ్చి చక్రతీర్థ స్నానాలు చేయగా.. భక్తులు సైతం స్వామి వారిని కనులారా వీక్షించి పవిత్ర స్నానాలాచరించారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత స్వామికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా, అర్చకులు బంకుపల్లి నాగరాజు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి ముందురోజు రాత్రికి చేరుకున్న భక్తులు బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు గ్రామాల్లో విడిదులు ఏర్పాటు చేసుకొని వ్రతాలు చేశారు. అధిక సంఖ్యలో దాసురాళ్లు, దాసుళ్లు వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. రాత్రంతా దాసుళ్ల పూజలతో పాటు తప్పెటగుళ్లు, దాసుపాటలు భక్తులను అలరించాయి. సీఐ పైడపునాయుడు, ఎస్ఐలు ఎం.జనార్ధన్, ఎస్.గణేష్, ఎస్.హరికృష్ణల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అద్భుతం.. అరటి గెలల ఉత్సవం



భీష్మ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శనివారం నుంచి చెట్లతాండ్ర గ్రామంలోని పరావస్తు అయ్యవారు లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో అరటి గెలల ఉత్సవం అద్భుతంగా జరిగింది. సుమారు 5వేలు అరటి గెలలను భక్తులు కట్టారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులంతా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అయితే అరటి గెలల పందిరి కూలిపోయింది. భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

– సంతబొమ్మాళి

క్లుప్తంగా

సుజుకీ యాక్సెస్ 125 కొత్త మోడల్ ఆవిష్కరణ



స్కూటీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగరంలోని పెదపాడు రోడ్డులో శ్రీ విజయలక్ష్మీ మోటార్స్‌లో సుజుకీ యాక్సెస్-125 నూతన మోడల్ స్కూటీని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ద్విచక్ర వాహనం మహిళలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడంతో పాటు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు.షోరూం మేనేజర్ అంధవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ ఐదు కలర్స్‌తో నూతన మోడల్ స్కూటీ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుజన నేత కంత వేణు, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సిరిపురం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సిరిపురం తేజేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా సిరపురం తేజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కోర్ కమిటీ సమక్షంలో మినిట్స్ బుక్‌లో సంతకం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఎంబీజీ నాయుడు, చల్లా వెంకటేశ్వరరావు, రాఘవరావు, దుర్గారావుగాంధి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు మాస్టర్స్ అథ్లెట్స్ జోరు



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న జిల్లా మాస్టర్ అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. అనంతపురం వేదికగా ఈ నెల 7 మొదలైన పోటీలు 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మార్చ్‌ఫాస్ట్‌లో జిల్లా క్రీడాకారులు ఆకట్టుకున్నారు. మొదటి రెండు రోజుల్లో త్రోస్, జంప్స్, రన్స్ విభాగాల్లో 20 పతకాలు సాధించినట్టు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు తెలిపారు.

చెన్నైలో వలస కూలి మృతి



సింహాచలం(ఫైల్)

సంతబొమ్మాళి: మండలంలోని మర్రిపాడు పంచాయతీ శెలగపేట గ్రామానికి చెందిన తామాడ సింహాచలం (54) అనే వలస కూలి శనివారం చెన్నైలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జీవనోపాధి కోసం పైప్ లైనింగ్ వర్క్ చేస్తుండగా మట్టి జారిపడటంతో కింద కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సింహాచలంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రిమ్స్ హాస్టల్లో పాముల భయం



హాస్టల్ గదిలో నాగుపాము

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాల హాస్టల్ విద్యార్థులను పాముల భయం వెంటాడుతోంది. 20 రోజుల్లో రెండు సార్లు నాగుపాము రావడంతో వైద్య విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయని, అక్కడే పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోవడం, చాలా గదులు అధ్వానంగా తయారవ్వడంతో విషసర్పాలు రెండో అంతస్తు వరకు వచ్చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కోనేరులో పడి మాజీ సైనికుడు మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

కాశీబుగ్గ : పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న బ్రాహ్మణ వీధి కోనేరులో పడి వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన సిగలపల్లి కోటేశ్వరరావు (42) అనే మాజీ సైనికుడు మృతి చెందారు. ఈయన కాశీబుగ్గ తిలక్‌నగర్‌లో నివాసముంటున్నారు. స్నానానికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది వెతికారు. సాయంత్రానికి శవమై తేలడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కోటేశ్వరరావుకు తండ్రి మల్లేష్, తల్లి సరోజిని, భార్య నాగ, కుమారుడు అఖిల్ ఉన్నారు.

ప్రాక్టికల్స్‌కు సిద్ధంగా ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్



ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- 113 కేంద్రాలు.. 14920 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఒత్తిడి వదిలితే మార్కులు సులువంటున్న నిపుణులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 10 నుంచి సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ షురూ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 113 కేంద్రాల్లో నిఘా నేత్రాల నడుమ జరిగే ప్రాక్టికల్‌కు 14920 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ విద్యార్థులు 10113 మంది, బైపీసీ విద్యార్థులు 4807 మంది ఉన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి సీఎస్‌ల నియామకంతోపాటు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ల నియామకాలను సైతం పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉంటూ ఆందోళన చెందకుండా పరీక్ష రాస్తే అతి సులువుగా మెరుగైన మార్కులు సాధించవచ్చని ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చెబుతున్నారు.

'ఫిజిక్స్'లో ప్రయోగానికే పెద్దపీట..



భౌతిక శాస్త్రాని(ఫిజిక్స్)కి మూడు గంటల సమయానికి 30 మార్కులు కేటాయిస్తారు. లాగరిథమ్స్ ఉపయోగిస్తూ కాలిక్యులేషన్స్ చేస్తే పూర్తి మార్కులు వస్తాయి. అన్ని ప్రయోగ విలువలు ఒకే ప్రమాణ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలి.

– సక్కురి అన్నపూర్ణారావు, ఫిజిక్స్ సీనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) శ్రీకాకుళం

'జువాలజీ'లో భాగాలు ముఖ్యం..



జంతుశాస్త్రం(జువాలజీ) ప్రయోగ పరీక్షకు 3 గంటల సమయం ఇస్తారు. 30 మార్కులు ఉంటాయి. అకశేరుకాలు, సకశేరుకాలకు సంబంధించిన స్లైడులు, స్పెసిమెన్లను గుర్తించడంలో ఒత్తిడికి లోనుకాకూడదు. ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి.

– గూణ సింహాచలం, జువాలజీ నిష్ణాతులు, ప్రిన్సిపాల్–జీజేసీ రణస్థలం

'కెమిస్ట్రీ'లో ఫలితం తప్పనిసరి..



రసాయన శాస్త్రం(కెమిస్ట్రీ)లో మూడు గంటల సమయానికి 30 మార్కులు ఉంటాయి. మూడు విభాగాలుగా ప్రాక్టికల్స్ ఉంటాయి. లవణ(సాల్ట్) విశ్లేషణ, ఘన పరిమాణాత్మక విశ్లేషణపై దృష్టి సారించాలి. వైవా, ప్రాజెక్టు రికార్డు, జనరల్ రికార్డులూ ముఖ్యమే.

– బొమ్మలాట శ్యామ్‌సుందర్, కెమిస్ట్రీ నిష్ణాతులు, ప్రిన్సిపాల్– జీజేసీ ఆమదాలవలస

'బోటనీ'కి సూటిగా రాయాలి..



వృక్షశాస్త్రం(బోటనీ) ప్రయోగ పరీక్షకు 3 గంటల సమయం ఇస్తారు. 30 మార్కులు ఉంటాయి. వర్ణన క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా రాయాలి. అడిగిన చిత్రపటాలు, లక్షణాలు, బాగా సాధన చేసి తప్పులు లేకుండా రాయాలి.

– ఆరంగి అప్పన్న, బోటనీ సీనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట



శోభాయాత్రలో పాల్గొన్న కళాబృందాలు

వైభవంగా శోభాయాత్ర



పీఎన్ కాలనీ వద్ద భక్తబృందాలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని భక్తి చైతన్య శోభాయాత్ర శనివారం ఘనంగా జరిగింది. ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ లలితామణి ఆధ్వర్యంలో పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల నుంచి ప్రారంభమైన ఈ యాత్ర గుజరాతిపేట, ఏడురోడ్ల కూడలి, కాకివీధి మీదుగా పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వరకు సాగింది. 25 కోలాట బృందాలు, 2 తప్పెటగుళ్ల బృందాలు, 2 కూచిపూడి బృందాలు, 20 తాళ భజన బృందాలు పాల్గొన్నాయి. తొలుత ఈ యాత్రను పరత్మానంద స్వామి, గణేష్ స్వామి ప్రారంభించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ తిరుమల అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ తిరుమల ఆలయం వద్ద సందడి

దళితులంటే రఘురామకు చులకన



మాట్లాడుతున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బాధ్యత గల డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్న రఘురామ కృష్ణంరాజుకు దళితులంటే చులకన భావమని దళిత సంఘాల జేఏసీ నేతలు మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో చెరువుల ఆక్రమణ తొలగించడంతో నిరాశ్రయులైన దళితులు, బడుగు బలహీన వర్గాల వారిని పరామర్శించేందుకు ఎయిమ్ నాయకులు వెళ్లగా.. విద్వేషాలను రెచ్చగొట్టేందుకు వచ్చారని రఘురామకృష్ణంరాజు తప్పుడు ప్రచారాలు చేయడాన్ని వారు ఖండించారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హాల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కళ్లేపల్లి రామ్‌గోపాల్, జిల్లా అధ్యక్షుడు కంత వేణు, జేఏసీ నాయకులు యజ్జల గురుమూర్తి, ఒంపూరు రమేష్ తదితరులు మాట్లాడారు. ఆకివీడులో బాధితులను పరామర్శించేందుకు ఎయిమ్ స్టిక్కర్లు ఉన్న వాహనంలో దళిత నేతలు వెళ్లడం నేరమెలా అవుతుందని ప్రశ్నించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్‌పై అనవసర వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి విషయాన్ని సునీల్‌కుమార్‌కు ఆపాదించడం అలవాటైపోయిందని ధ్వజమెత్తారు. దళితుల అభ్యున్నతి కృషి చేస్తున్న సునీల్‌కుమార్‌పై ఎందుకంత అక్కసని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, ఎన్‌డీఏ ప్రభుత్వం అండదండలున్నాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. గతంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసినప్పుడు రఘురామకృష్ణంరాజుపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా వదిలేశారని గుర్తు చేశారు. సమావేశంలో కొర్రాయి ప్రసాద్, పురుషోత్తం రాంబాబు, అబ్బాస్, లింగాల దిలీప్, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల సంఘం కోశాధికారిగా నాగేశ్వరరావు

నరసన్నపేట: జిల్లా మిల్లర్ల సంఘం కోశాధికారిగా నరసన్నపేటకు చెందిన మిల్లర్ తంగుడు నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఇటీవలే జిల్లా సంఘ కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్ల సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. నాగేశ్వరరావును మిల్లర్లు తంగుడు జోగారావు, సీతారామరాజు తదితరులు అభినందించారు.

చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం



సీసీ ఫుటేజీకి చిక్కిన దొంగలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో బంగారం షాపులో చోరీ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. సీఐ జె.శ్రీనివాసరావు శనివారం కూడా షాపును పరిశీలించగా.. సీసీఎస్ సీఐ, ఇతర సిబ్బంది సమక్షంలో ఆధారాలు సేకరిస్తున్నారు. స్థానికులు మాత్రం దొంగలు కుర్చీలు అమ్మడానికి వచ్చిన వారిలా ఉన్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చోరీలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిర్ధారించారు. వీరందరూ స్థానికంగానే ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ముషిడిగట్టు వైపు నాలుగు సైకిళ్లపై శుక్రవారం ఉదయం వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. భీష్మ ఏకాదశి సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అనివెట్టి మండపంలో ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణం జరిపించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, ఈవో వై.భద్రాజీ, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీలో అదరగొట్టిన ప్రసాద్



ప్రసాద్‌ను అభినందిస్తూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ సీజన్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్ సింగుపురం దుర్గ నాగ వరప్రసాద్ మరోసారి అదరగొట్టే ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న కల్నల్ సీకేనాయుడు అండర్-23 అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీలో అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 148 బంతుల్లో 9 బౌండ్రీలు, 4 సిక్సర్లతో 107 పరుగుల అజేయ సెంచరీతో రాణించి ఆంధ్రా జట్టు విజయంలో కీలకభూమిక పోషించాడు. ప్రస్తుతం ఆంధ్రా జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. ఏసీఏ తన అధికారిక ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియాలో అభినందిస్తూ పోస్ట్‌చేసింది. ప్రసాద్ రాణింపు పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ ఎస్.రవికుమార్, ఆర్సీ రెడ్డి, సీనియర్ క్రికెటర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇదే లెక్కన రాణిస్తే 2026 ఐపీఎల్‌తోపాటు రంజీలు, జాతీయ జట్టు సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక కావడం ఖాయమని జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు భావిస్తున్నారు.

జలుమూరు కుర్రాడే..

జలుమూరులోని పోలీస్‌స్టేషన్ వీధిలో నివాసం ఉండే ఎస్‌డీఎన్‌వి ప్రసాద్ తండ్రి సింగుపురం ఉపేంద్ర కారు డ్రైవర్‌గా పనిచేస్తూ 2019లో అనారోగ్యంతో మరణించగా.. తల్లి సింగుపురం రేవతి జలుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ప్రసాద్ టెక్కలిలో ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం కంప్యూటర్స్ సెకెండియర్ చదువుతున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్‌కు ఎంపికకావడమే తన ధ్యేయమని.. అందులో రాణించి జాతీయ జట్టుకు ఎంపికకావడమే జీవితాశయమని ప్రసాద్ చెబుతున్నాడు.

సమ సమాజ స్థాపనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తున్న రాజకీయ పార్టీలను సాగనంపేందుకు యువత కదలిరావాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర మహా సభల్లో భాగంగా మూడో రోజు శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ చట్టసభల్లో ఉద్యమకారులు ఉన్నప్పుడే ప్రజాశ్రేయస్సు సాధ్యమవుతుందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్న దుర్మార్గులను, అమ్మేందుకు సహకరిస్తున్న వారిపై పోరాడాలన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని గద్దెనెక్కిన బాబు అధికారం చేపట్టిన ఈ 9 నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో, దేశంలో ఎక్కడ చూసినా మత్తు పదార్థాలు, ఆహార పదార్థాలు కల్తీలు జరుగుతున్నాయని, ప్రతి 100 మందిలో 26 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని మెడికల్ సంస్థలు రిపోర్టు వెల్లడిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర నాయకులు సీ.హెచ్ గీత, పి. సంతోష్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా మొజ్జాడ యుగంధర్, కార్యదర్శిగా పరుచూరి రాజేంద్ర బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సీహెచ్ గీత, పి.ప్రభాకర్, కె.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా కె.రవి, వై.బాబీ, షేక్ సుభానీ, జి.నాగరాముడు, కోశాధికారిగా వై.రాంబాబుతో పాటు 91 మంది సమితి సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు హరేష్ బాల అభినందించారు.

ఆకట్టుకున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



పద్మశ్రీ యడ్ల గోపాలంను సన్మానిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు

ఆమదాలవలస : పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉభయ రాష్ట్రాల నాటిక పోటీలు కళాప్రియులను ఆకట్టుకుంటున్నాయి. స్థానిక రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రెండవ రోజు కార్యక్రమంలో సీనియర్ రంగస్థల కళాకారులు, కలియుగ నక్షత్రిక పద్మశ్రీ యడ్ల గోపాలంను కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి పురస్కారం అందించారు. అంతకుముందు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బీజేపీ కన్వీనర్ పేడాడ సూరప్పనాయుడు, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, కాంగ్రెస్ ఇన్‌చార్జి సనపల అన్నాజీరావు, డాక్టర్ దానేటి శ్రీధర్, బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ నిర్వాహకులను అభినందించారు. రెండో రోజు ప్రదర్శనలో హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించిన స్వేచ్ఛ, ఆంధ్ర కళాకారులు ప్రదర్శించిన మరో రెండు నాటికలు ఆకట్టుకున్నాయి.

కవిటిలో అంతర్రాష్ట్ర నాటిక పోటీలు



నాటికలో ఓ సన్నివేశం

కవిటి: సమాజంలో పేదల జీవితాలకు సవాళ్లు విసురుతున్న సమస్యలు, పాశ్చాత్య పెడధోరణులే ఇతివృత్తాలుగా తెరకెక్కించిన జనరల్ బోగీలు, నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలు ఆద్యంతం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాయి. గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన సాయిఆర్ట్స్ బ్యానర్‌పై ప్రదర్శితమైన 'జనరల్ బోగీలు' నాటిక నేటి భారతీయ రైల్వే ప్రయాణీకుల కష్టాలకు సాక్షీభూతంగా నిలిచింది. అనంతరం ప్రదర్శితమైన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక? సైతం పాశ్చాత్య పెడధోరణిలో పెళ్లి చేసుకుని పిల్లలతో ఉన్న వ్యక్తులు వేరొక వ్యక్తితో సహజీవనం చేయడంపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఓ కేసులో ఇచ్చిన తీర్పు(498 ఏ ఐపీసీ)ను కొందరు పురుషులు, మహిళలు ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నారు అనే ఇతివృత్తంతో సాగింది. అంతకు ముందు కళాపరిషత్ పోటీలను కళ్యాణీ గ్రూప్ సంస్థల అధినేత లోళ్ల రాజేష్, సర్పంచ్ బి.శ్రీరాం ప్రసాద్, బి.లక్ష్మణమూర్తి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు.

గురుకుల ప్రవేశాలకు వేళాయెె!

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ
- ఏప్రిల్ 6న ప్రవేశపరీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లీషుమీడియం)లలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్.బాలాజీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 6 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. https://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్షలో సాధించిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సమీప సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రధానాచార్యులను గానూ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి కార్యాలయ సిబ్బంది (9701736862, 9000314209, 08942-279926)ని సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యాలయం	ఫోన్ నెంబర్	5వ తరగతి సీట్లు	ఇంటర్ సీట్లు
దుప్పలవలస(బాలురు)	9704550004	80	80
కంచిలి(బాలురు)	9704550005	80	80
ఎచ్చెర్ల (బాలికలు)	9704550005	80	80
పెద్దపాడు(బాలికలు)	9704550007	80	80
నందిగాం(బాలికలు)	9704550005	80	80
కొల్లివలస (బాలురు)	9049356321	80	80
తామరాపల్లి (బాలికలు)	9704550010	0	160
మందస(బాలికలు)	9704550012	80	80
పాతపట్నం(బాలికలు)	9676488008	80	80
మొత్తం		640	800

ఒకే రోజు..

5వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అదే రోజున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

అర్హతలు..

5వ తరగతిలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీలు 01-09-2012 నుంచి 31-08-2016 మధ్య, ఓసీ, బీసీ ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్లు 01-09-2014 నుంచి 31-08-2016 మధ్య జన్మించిన వారై ఉండాలి. ఇంటర్‌లో చేరేందుకు 31-08-2025 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షకు (మార్చి-2025) హాజరవుతున్న వారు మాత్రమే అర్హులు. అభ్యర్థి తల్లి/తండ్రి/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,00,000 మించరాదు. నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.